# ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి
- రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. సోమవారం కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియా, కౌంటింగ్ పరిశీలకురాలు మృణాళినీసావంత్, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సమక్షంలో చేవెళ్ల మండలం, గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పూర్తి పారదర్శకంగా చేపట్టారు. కౌంటింగ్ సిబ్బందిని సెకండ్ ర్యాండమైజేషన్ ద్వారా ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపునకు కేటాయించారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఈ ప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్ ద్వారా చూపించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొంటున్న మైక్రో అబ్జర్వర్లకు ఓట్ల లెక్కింపుపై శిక్షణా తరగతులు కూడా నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా నిర్వర్తించాల్సిన విధులు, పాటించాల్సిన నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించారు. మంగళవారం ఉదయం ఐదు గంటలకు మూడోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి కాగానే ఆ జాబితా ఆధారంగా పార్లమెం ట్ సెగ్మెంట్ పరిధిలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు శాసనసభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని కేటాయిస్తామని కలెక్టర్ శశాంక తెలిపారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఏడు కౌంటింగ్ హాళ్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా కౌంటింగ్ హాల్‌ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపునకు 28 చొప్పున టేబుళ్లు, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల కౌంటింగ్‌కోసం 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల ఓట్లను అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఒక్కో రౌండ్ వారీగా లెక్కిస్తూ.. ఫలితాలను వెల్లడిస్తామన్నారు. అభ్యర్థులు, వారి తరపున ఏజెంట్లు ఉదయం ఆరుగంటలకే కౌంటింగ్ సెంటర్ వద్దకు రావాలని, తాము జారీ చేసిన ఎంట్రీ పాసులతోపాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలన్నారు.

చేవెళ్ల పార్లమెంట్ పరిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోల్ అయిన ఓట్లను రౌండ్ల వారీగా లెక్కించేందుకు వీలుగా 25 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్ లో ఉంచుతూ.. ఈవీఎం ఓట్ల కౌంటింగ్‌కోసం 545 మందిని, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 126 మందిని కలుపుకొని మొత్తం 671 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించామన్నారు. వీరిలో 206 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 252 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 219 మంది మైక్రో అబ్జర్వర్లు ఉన్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కౌంటింగ్ కేంద్రం చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.



కౌంటింగ్ కేంద్రంలో జరిగిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ కలెకర్లు శశాంక, నారాయణరెడ్డి, ఎన్నికల పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియా, కౌంటింగ్ పరిశీలకురాలు మృణాళినీసావంత్

## చిలుకూరు బాలాజీ సేవలో గవర్నర్ రాధాకృష్ణన్

రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం ఆలయానికి మొదటిసారి వచ్చిన ఇన్‌చార్జ్ గవర్నర్‌కు ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రంగరాజన్ స్వామివారి మెడలోని హారాన్ని తీసి గవర్నర్ మెడలో వేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. చిలుకూరు బాలాజీని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని గవర్నర్ అన్నారు. - మొయినాబాద్, జూన్ 3





## అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా నవీన్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో సోమవారం ఆయన తన కుటుంబసభ్యులు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి జోగుళాంబ అమ్మవారు, బిచుపల్లిలోని హనుమాన్ ఆలయంలో అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. -నందిగామ, జూన్ 3

జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో

## విజిలెన్స్ అధికారుల తనిఖీలు

వికారాబాద్, జూన్ 3 : వికారాబాద్ జిల్లాలో తునికాకు తెంపిన వారికి అందాల్సిన డబ్బులు ఇతరుల ఖాతాల్లో పడ్డాయని వచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ డీఎఫ్‌వో విజిలెన్స్ అధికారి రాజశేఖర్ సోమవారం వికారాబాద్ జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో తనిఖీలు చేశారు. 2017లో తునికాకు తెంపించిన కూలీలకు అదే ఏడాదిలో డబ్బులు వచ్చాయి. అయితే తునికాకును అధికంగా తెంపినందుకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా జిల్లాకు రూ.60 లక్షలను బోనస్‌గా మంజూ రు చేసింది. ఆ డబ్బు వికారాబాద్ జిల్లాలోని ఆయా అటవీశాఖ పరిధిలో పనిచేసిన కూలీల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. కాగా వికారాబాద్ గొట్టిముక్కల యూనిట్ కింద పని చేసిన కూలీల ఖాతాల్లో కాకుండా ఇతరుల అకౌంట్లలో రూ. 7.51 లక్షలు తప్పుగా జమఅయినట్లు సమాచారం వచ్చింది. ఆ సమాచారం మేరకు సోమవారం డీఎఫ్‌వో విజిలెన్స్ అధికారి రాజశేఖర్ అటవీశాఖ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం వివరాలు చెబుతామన్నారు.



## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ కేంద్రాన్ని డీఆర్‌డీవో శ్రీలత, సూర్యారావు, నందిగామ ఎంపీడీవో సుమతి, ఏపీఎం యాదగిరి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్‌లను కుట్టే బాధ్యతను అప్పగించిందని.. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. – నందిగామ, జూన్ 3

## గాంధీ వైద్యుడిపై విచారణ పూర్తి

డీఎంఈకి నివేదిక

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): సర్జరీ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన గాంధీ దవాఖాన వైద్యుడిపై విచారణ పూర్తయింది. దర్యాప్తు నివేదికను దవాఖాన సూపరింటెండెంట్ డా.రాజారావు సీల్డ్ కవర్‌లో డీఎంఈకి సమర్పించారు. గాంధీ దవాఖానలో శస్త్రచికిత్స చేసేందుకు ఓ వైద్యుడు రోగి వద్ద డబ్బులు డిమాండ్ చేసినట్లు ఇటీవల దవాఖాన సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. దీనిని సీరియస్‌గా తీసుకున్న గాంధీ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదుపై నాలుగు విభాగాధిపతులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, విచారణకు ఆదేశించారు. ప్రత్యేక కమిటీ విచారణ జరిపి సూపరింటెండెంట్‌కు నివేదికను సమర్పించింది. ఈ మేరకు నివేదికను గాంధీ సూపరింటెండెంట్ డా.రాజారావు డీఎంఈకి సీల్డ్ కవర్‌లో సమర్పించారు. నివేదిక ఆధారంగా ఒకటి రెండు రోజుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడిపై డీఎంఈ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

## నల్లవెల్లిలో బయటపడిన పురాతన విగ్రహం

పూజలు చేసిన స్థానికులు



యాచారం, జూన్ 3 : మండలంలోని నల్లవెల్లి గ్రామ శివారులో కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తుండగా సోమవారం అతి పురాతనమైన రాతి విగ్రహం బయటపడింది. గ్రామానికి చెందిన సత్తిరెడ్డి వ్యవసాయ భూమి నుంచి గొల్లపల్లి భాస్కర్ పొలం వరకు కూలీలు మట్టి రోడ్డు పనులు చేస్తుండగా గునపానికి రాయి తగిలింది. దానిని పైకి తీసి పురాతన రాత్రి విగ్రహంగా వారు గుర్తించారు. బయటకు తీసిన వద్దే విగ్రహాన్ని ఉంచి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. జరుగుతున్న ఉపాధి పనులు బొగ్గులగట్టు సీతారామలింగేశ్వరాలయ సమీపంలో కావడంతో రాముడి విగ్రహంగా కూలీలు భావించారు. విగ్రహ ఆనవాళ్లను బట్టి బుద్ధుడి విగ్రహమని కొంత మంది అంటున్నారు. విగ్రహానికి నాలుగు చేతులు ఉండడంతో అమ్మవారి విగ్రహమని మరికొంతమంది చెబుతున్నారు. విగ్రహం శిథిలావస్థలో ఉండడంతో ప్రజలు సరిగ్గా గుర్తించలేక పోతున్నారు. పురావస్తుశాఖ అధికారులు నిర్ధారిస్తే తప్ప కచ్చితంగా చెప్పలేమని పెద్దలు అంటున్నారు. విగ్రహాన్ని చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చి పూజలు చేశారు.

విద్యార్థులకు బస్ పాసుల

## జారీకి అంతా సిద్ధం

18 ఏండ్లలోపు విద్యార్థినులకు ఉచిత పాసులు

- నగరంలో ప్రత్యేకంగా బస్ పాస్ కౌంటర్లు
- గ్రేటర్‌లో 43 బస్ పాస్ కేంద్రాలు: ఆర్టీసీ అధికారులు

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో 2024–25వ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా బస్ పాసులను జారీ చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేశామని గ్రేటర్ ఆర్టీసీ అధికారులు సోమవారం తెలిపారు. అన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలో సంబంధిత అడ్మినిస్ట్రేటివ్ చార్జీలను చెల్లించాలి. అదే సమయంలో ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థలు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించకుండా మినహాయింపు ఉందని అధికారులు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఫీజు చెల్లించిన ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు మాత్రమే బస్సు పాసులు ఇస్తామని అధికారులు తెలిపారు.

### బస్ పాసుకు దరఖాస్తు ఇలా...

విద్యార్థులు తమకు కావాల్సిన బస్సు పాసును టీజీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ (HTTP://TGSRTC.COM/)లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తమ విద్యా సంస్థ నుంచి ఆన్‌లైన్‌లో ఫార్వార్డ్ చేయించుకొని దరఖాస్తు ఫారంపై ప్రిన్సిపాల్ సంతకం, విద్యా సంస్థ సీల్ వేయించుకొని వారు ఎంచుకున్న బస్‌పాస్ కేంద్రంలో పాస్ పొందవచ్చని సూచించారు. జూన్ 1వ తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని సుమారు 43 కేంద్రాల్లో బస్ పాసుల జారీ ఉంటుందని తెలిపారు.

### 18 ఏండ్లలోపు విద్యార్థినులకు ఉచిత పాసులు

విద్యా సంస్థల్లో 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినిలకు ఉచిత పాసులను జారీ చేస్తామని, అదే విధంగా ఏడో తరగతి చదవుతున్న 12 ఏళ్లలోపు విద్యార్థులందరికీ ఉచిత పాసులను జారీ చేస్తామని తెలిపారు. విద్యార్థుల అవసరాలను బట్టి నెల, మూడు నెలల పాసుల జారీ ఉంటుందని తెలిపారు. బస్‌పాసుల జారీకి మరింత సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్, ఫోన్ నం. 800820 4216లో సంప్రదించాలని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూచించారు.

### బస్ పాసుల కేటగిరీలు ఇలా...

*స్టూడెంట్ జనరల్ పాస్(నెలకు) రూ.400.00*

*స్టూడెంట్ జనరల్ పాస్ (3 నెలలకు) రూ.1200.00*

*స్టూడెంట్ రూట్ పాస్ (3నెలలకు) 4 కి.మీకు రూ.450, 8 కి.మీ రూ.600, 12 కి.మీ రూ.900, 18 కి.మీ రూ.1150, 22 కి.మీ రూ.1350.00లు చెల్లించాల్సి ఉంటుంది.*

*స్టూడెంట్ గ్రేటర్ హైదరాబాద్ పాస్, స్టూడెంట్ సిటీ స్పెషల్ పాస్, స్టూడెంట్ ఎక్సిక్లూజివ్ పాస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్‌లను ఆయా కేంద్రాల్లో జారీ చేస్తారు.*

# శిథిల భవంతులపై నిర్లక్ష్యమేల ?

## నిన్న హఫీజ్‌పేట.. నేడు బాబుల్‌రెడ్డి నగర్

- భయపెడుతున్న పురాతన గోడలు, శిథిల భవనాలు
- రెండు ఘటనల్లో ముగ్గురు చిన్నారులు సహా మొత్తం నలుగురి మృతి
- స్పెషల్ డ్రైవ్ ఆలస్యమే.. ప్రమాదాలకు కారణం?



సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మొన్నటికి మొన్న.. గత నెల రెండో వారంలో హఫీజ్‌పేట డివిజన్ సాయినగర్ యూత్ కాలనీలో బాల్కని గోడ కూలి మూడేళ్ల బాలుడు సమద్‌తో పాటు రషీద్(51) చనిపోయారు. గత సోమవారం మైలార్‌దేవపల్లి బాబుల్‌రెడ్డి నగర్‌లో గోడ కూలి నూర్జహాన్ కటూన్(10), ఆఫ్రియా పర్వీన్(5)లు మృతి చెందారు. ఈ రెండు ఘటనల్లో భారీ వర్షానికి గోడలు తడిసి ముద్దయి కూలిపోయాయి. వాస్తవంగా పురాతన గోడలు, శిథిల భవనాల పట్ల జీహెచ్ఎంసీ ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంటుంది. ప్రతి ఏటా మాన్‌సూన్‌కు ముందుగానే జోన్ల వారీగా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనాలపై టౌన్ ప్లానింగ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. శిథిల, ప్రమాదకరమైన భవనాలలో ఉన్న నివాసితులను గుర్తించి, వారిని అక్కడిని నుంచి ఖాళీ చేయడానికి గాను వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. దాంతో పాటు అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు ఆయా భవనాల చుట్టూ బారికేడ్లను అమర్చాల్సి ఉంటుంది. వీటి పరిసర ప్రాంతాల్లోని నివాసితులు తగు జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంటుంది. కాని, ఈ ఏడాది శిథిల, పురాతన భవనాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ ఆలస్యంగా ప్రారంభించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 498 శిథిల, పురాతన భవనాలను గుర్తించి అధికారులు గడిచిన 15 రోజులుగా 132 చోట్ల చర్యలు చేపట్టగా, పెండింగ్‌లో 366 ప్రాంతాలున్నాయి. ఒక్క చార్మినార్ జోన్‌లోనే 105, సికింద్రాబాద్‌లో 98, ఖైరతాబాద్‌లో 90 వరకు ఉండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. వచ్చే వారంలో వర్షాకాలం ప్రారంభం కానుండటం, పెండింగ్‌లో భారీగా పురాతన భవనాలు ఉండటంతో ప్రమాదకర భవనాల పట్ల స్థానికులు, నివాసితుల ప్రాణాల భద్రత గాలిలో దీపంలా మారింది. ఏదైనా ఘటన జరగక ముందే అధికారులు అప్రమత్తమై శిథిల భవనాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



### పురాతన, శిథిల భవనాల స్పెషల్ డ్రైవ్ వివరాలు

| జోన్ | మొత్తం గుర్తించినవి | కూల్చివేత /ఖాళీ చేపించినవి | పెండింగ్‌లో ఉన్నవి |
|---|---|---|---|
| ఎల్బీనగర్ | 62 | 39 | 23 |
| చార్మినార్ | 131 | 26 | 105 |
| ఖైరతాబాద్ | 117 | 27 | 90 |
| సికింద్రాబాద్ | 114 | 16 | 98 |
| శేరిలింగంపల్లి | 33 | 15 | 18 |
| కూకట్‌పల్లి | 41 | 9 | 32 |
| **మొత్తం** | **498** | **132** | **366** |

# అయ్యో.. పాపం

## చిన్నారులను చిదిమేసిన మట్టిపెల్లలు

శిథిలావస్థకు చేరిన గోడ కూలి ఇద్దరు చిన్నారుల మృతి

మరో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

బాబుల్‌రెడ్డినగర్‌లో విషాదఛాయలు



అఫ్రీయా పర్వీన్, నూర్ జహాన్ కటూన్

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 3 : శిథిలావస్థకు చేరిన గోడ కూలి ఇద్దరు చిన్నారులు మృతి చెందగా.. మరో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మధు కథనం ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన నిరుపేదలు కొంత కాలంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో నివాసముంటూ స్థానికంగా ఉన్న పారిశ్రామికవాడలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మహ్మద్ నజీమ్ కూతురు నూర్‌జహాన్ కటూన్(10), మహ్మద్ అలీ (9), నజీమా(6), మహ్మద్ అక్బర్ కుమార్తె అఫ్రీయా పర్విన్(5), మహ్మద్ అఫ్జల్ కూతురు అఫ్రీది(3) సోమవారం ఉదయం వారి ఇంటి సమీపంలో ఆడుకుంటున్నారు. అదే ప్రాంతంలో ఉన్న శిథిలావస్థకు చేరిన గోడ ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసిపోయి ఒక్కసారిగా కుప్పకూలి చిన్నారులపై పడింది. ఈ ప్రమాదంలో నూర్ జహాన్ కటూన్(10), అఫ్రీయా పర్విన్(5) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు చిన్నారులు మహ్మద్ అలీ, నజీమా, అఫ్రీద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు..

అబంశుభం ఎరుగరని చిన్నారులు ఆడుకుంటూ మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అప్పటి వరకు తమ కళ్ల ముందు ఆడుకున్న చిన్నారులు తిరిగి రాని లోకానికి వెళ్లిపోవడంతో గుండెలు అవిసేలా రోదించారు. దీంతో బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## విద్య, ఉద్యోగావకాశాలపై మిలో సీసీఎంబీ

- హౌజ్ కీపింగ్ స్టాఫ్ చిన్నారులకు ప్రవేశం

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భావితరాలకు విజ్ఞాన రంగంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా తొలిసారిగా ప్రత్యేకమైన మిలో సీసీఎంబీని ఏర్పాటు చేసింది. సీసీఎంబీలో పనిచేసే హౌజ్ కీపింగ్ స్టాఫ్ సిబ్బంది పిల్లలకు సెంటర్‌లో ప్రవేశం కల్పించారు. లేబోరేటరీలో జరిగే పరిశోధనలు, జన్యు టెక్నాలజీ, ప్రోటీన్ విశ్లేషణ, కణాల పనితీరుపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం, సైంటిస్టులతో ప్రత్యేక ఇంటరాక్షన్ సమావేశంతో పాటు, సీసీఎంబీ డైరెక్టర్‌ను కలిసే అవకాశం కల్పించారు.



ట్రై కమిషనరేట్ల పరిధిలో

## నేడు మద్యం బంద్

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నేడు ఉదయం 6 నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు కంపౌండ్లు మూసివేస్తూ ట్రై కమిషనరేట్లకు చెందిన కమిషనర్లు ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా మూడు కమిషనరేట్ల పరిధిలో నేడు ఉదయం 6 నుంచి రేపు ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ విధిస్తున్నట్లు పోలీసు కమిషనర్లు వెల్లడించారు. ఆంక్షల నేపథ్యంలో మూడు కమిషనరేట్ల పరిధిలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలు, సమావేశాలు నిషేధమని, ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదని ఆదేశాల్లో పేర్కొన్నారు. మద్యం విక్రయాలపై నిషేధం ఉన్న సమయంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం సరఫరా చేసినా, బెల్టుషాపులు, ఇతర మార్గాల్లో మద్యం విక్రయాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్లు హెచ్చరించారు.

## టీజీ పాలిసెట్ ఫలితాల్లో పేద విద్యార్థుల సత్తా

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): టీజీ పాలిసెట్ – 2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పేద విద్యార్థులు సత్తా చాటారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ప్రతి ఏటా పేద విద్యార్థులకు పాలిసెట్ కోసం ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ఆన్‌లైన్ కోచింగ్‌లో 300 మంది విద్యార్థులు జూమ్ యాప్ ద్వారా కోచింగ్ తీసుకోగా మరొక 500 మంది విద్యార్థులు వాట్సాప్ గ్రూపుల్లో స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకున్నారని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉషారాణి తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులైన అనిత, అన్నపూర్ణ, రజినికుమారి, గంగాభవాని, శ్రీధర్, లక్ష్మణ్‌లతోపాటు పలువురు విద్యార్థులకు శిక్షణను ఇచ్చారు. దాదాపు 50 రోజుల పాటు కొనసాగిన శిక్షణతో వందలాది మంది పేద విద్యార్థులు లబ్ధి పొందారని తెలిపారు. వెయ్యిలోపు ర్యాంకులు పది మంది సాధించగా, శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్క విద్యార్థి ఎంట్రెన్ పరీక్షల్లో అర్హత సాధించారని ఆమె తెలిపారు.

